# About My Mother Sreemathi Utukri Lakshmikanthamma

**Raja Raja Narendra Utukuri**

8th August 2023

## **Prologue**:

A very important note:

The very first shloka, "Apadaam Apahartaaram Daataaram Sarva Sampadam | Lokaabhiramam Shree Ramam Bhuyo Bhuyo Namamyaham ||" in the very 1st page (of the essay) was given to me by my dear mother on 28th August 1963 before I boarded Air India flight in Madras airport on my way to Toronto Canada via Bombay and London, New York . She told me to keep the shloka with me for ever where ever I go in my life in her own hand writing on a piece of paper. This is now year August 2023, exactly 60 years since that day. She mentioned to me Lord Sree Rama will keep me safe. By the way, I went thru two severe car accidents and surgeries, in Canada, and multiple other surgeries and also a heart attack in my life. I owe my life to Lord Sree Rama through my mother's blessing. I felt like including this with this article. I still have that piece of paper on which she wrote it spontaneously that day in 1963. It's always in my wallet.

ఓం శ్రీ సత్యసాయి బాబా యై నమః

RAJARAJA NARENDRA UTUKURI

4 / జూలై / 1997

ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదం|
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహం||
శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం|
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే||
జననీ, జన్మ ప్రదాయినీ, జ్ఞానదాయినీ, మాతృదేవీ,
యాలక్ష్మీ కాంతా, నమస్తస్యై, నమస్తస్యై, నమో: నమః||

ఈ వేళ ఉదయంనా అనుంగు సోదరీమణులు సుహాసినీ, మైథిలీలతో టెలిఫోనులో మాట్లాడటం జరిగింది. ప్రస్తుతం డల్లాస్, అమెరికాలో నివాసం. నా కుమార్తె చిరంజీవి సుస్మిత ఇందియాకు ఒంటరిగా ప్రథమంగా బయలు దేరిందని విషయం తెలియచేయటం కొఱకై ఫోను చేయడం జరిగింది. ఆ సమయంలో నా జ్యేష్ఠ సోదరి శ్రీమతి సుహాసిని ఇలాగ అన్నది, తమ్ముడూ మన మాతృదేవిని గూర్చి ఒక స్మారక సంచిక ప్రచురించే ప్రయత్నంలో ఉన్నాము. నీవు కూడ అందులో ఒక వ్యాసం వ్రాయాలని పట్టు పట్టింది. నేను అప్పుడు, అక్కయ్యా నేను తెలుగులొ వ్రాయడమా? నాకు తెలుగులోనున్న పాండిత్య సంపద నీకు తెలుసుగదా? నేనెలాగ వ్రాయగలను? అదీగాక అమ్మ అంతటి మహా పండితురాల్ని గురించి నేను తెలుగులో వ్రాయడం ఎంతో అపహాస్యకరంగానూ, అసమంజసంగానూ ఉంటుంది అని అన్నాను. కానీ నా సోదరీమణులిద్దరూ, కనీసం ఇంగ్లీషులోనైనా వ్రాయి, మేము తెలుగులోకి అనువాదం చేసుకుంటామని అన్నారు. ఇంక నాకు తప్పనిసరి అయింది. నేను ఇంగ్లీషులో వ్రాయడం నా మాతృదేవికి అవమానాస్పదకరం అని తెలుగులోనే వ్రాస్తున్నాను. తెలుగులో ఆఖరి మాటు వ్యాసం వ్రాసింది 1954 లో జరిగిన **S.S.L.C.** తెలుగు పరీక్షలలోనే. 43 సంవత్సరాల తదుపరి తిరిగి అలాంటి ప్రయత్నం చేయడం చాలా సాహసమైన ప్రయత్నం. ఆ కారణంగా ఈ దినమంతా, నా కుమారిత ఒంటరిగా ఇండియా వెళ్ళిందని ఆందోళనగా ఉన్నా కూడా, నా మదిలో మాత్రం అమ్మనే తలుచుకుంటూన్నాను. ఈ ప్రయత్నానికి తగినంత సాహసం, ప్రోత్సాహం కలిగించమని శ్రీ బాబానీ నా మాతృదేవినీ తలుచుకుంటూనే ఉన్నాను.

ప్రస్తుతం రాత్రి 10:00 గంటలయింది. వ్యాసం వ్రాయడం ఆరంభించాను. కానీ ఎంతో కలవరం, భయం. ఎందుకంటే, ఆ మాతృమూర్తీని గురించీ, ఆ సర్వజ్ఞీ, ఆ అఖండ ప్రజ్ఞాశాలి, ధీమతీ, అఖండ విఖ్యాతిని, కళా ప్రపూర్ణ, మహా కవయిత్రిని గురించి వ్రాయడమంటే, ఎంత నా తల్లి

ఐనా గత 40 సంవత్సరాల నుంచీ సాంకేతిక విద్యాభ్యాసంలో, వృత్తిలో మునిగి తేలడానికి కూడా అవకాశం లేకున్న నాకు ఆ మహాకవి కాళిదాసు రఘువంశ కావ్యారంభంలో వ్రాసిన శ్లోకమొకటి గుర్తుకు వస్తున్నది. ః మందః కవియశః ప్రార్థీ గమిష్యా ముపహాస్యతాం, ప్రాంశు లభ్యే ఫలే లోభా దుద్బాహు రివవామనః ః ఆ మహా మాతృమూర్తిని గురించి వ్రాయాలంటే నాకు కూడా అలాంటి సంకోచం, భయం కలుగుతున్నాయి. అయినా ఆ మాతృమూర్తినీ, శ్రీ సాయిబాబా గారినీ తలంచుకుంటూ ఈ సాహసం చేస్తున్నాను. నన్ను క్షమిస్తారు గదూ సాహిత్యవేత్తలూ, సాహిత్యాభిమానులూ, మహాకవులూ, మహాపండితులూ, రచయితలూ అందరికీ నా క్షమాపణలు.

25 / జూలై / 1997

మా తల్లి గారిని గురించి నా జ్ఞాపకాలు కనీసం అర్ధ శత సంవత్సరాల పర్యంతం ఉంటాయి. నాకు 7 సంవత్సరాల ప్రాయంలోనే ప్రతి ఉదయం ఆమె వీణావాయిద్యం చేస్తూంటే ఆమె ఒడిలో పడుకుని వింటూండడంతో కర్ణాటక సంగీతంతో పరిచయం కలగడమయింది. నాకు రాగ తాళ జ్ఞానం లేక పోయినా శాస్త్రీయ సంగీతమంటే వల్లమాలిన అభిమానం ఇంతవఱకూ తగ్గలేదు. సంగీత, సాహిత్య, లలిత కళలంటే ఆమెకు ఎనలేని అభిమానమని అందరికీ తెలిసిన విషయమే. ఆవిధంగా చూస్తే ఆమె ఒక అపర సరస్వతి గానే అనిపిస్తుంది. నాకు చిరుప్రాయంలోనే సంస్కృతం నేర్పింది. ప్రతి దినం ఉషోదయం కాకుండానే నన్నూ, అక్కయ్యనూ, అన్నయ్యనూ నిద్రలేపి సంస్కృతం నేర్పించింది. ఆ చిరు ప్రాయంలోనే బాలరామాయణం, రఘువంశం, అమరకోశం, భగవద్గీతలు నేర్పింది. శ్రీ కాశీనాధుని విశ్వనాధశాస్త్రి గారి బాలభోధిని ద్వారా సంస్కృతం నేర్పింది. ఆనాటి సంస్కృత జ్ఞానం ఇప్పటి వఱకూ కొద్దో గొప్పో ఇంకా ఉండటం నాకే ఆశ్చర్యంగా ఉంటుంది.

బాపట్లలో సంగీత, సాహిత్య, నృత్య విద్యాభ్యాసాలకు నాంది కలిగించింది అమ్మ మాత్రమే. నాకింకా బాగా గుర్తు, విజయనగరం నుంచీ స్వర్గీయ శ్రీ అయ్యగారి సోమేశ్వరరావు గారిని బాపట్లకు తరలించి తీసుకు వచ్చి బాపట్లలో వీణా వాయిద్యాభ్యాసావకాశం కల్పించింది. తరువాత గ్వాలియర్ ఆస్థాన నృత్యాభ్యాసకులైన స్వర్గీయ శ్రీ దువ్వూరి నరసింహశాస్త్రి గారిని కూడ బాపట్లకు తరలించి బాపట్లలోని 40 మంది కన్నెపిల్లలకు నృత్యాభ్యాసం కల్పించింది. మా అక్కయ్యకు స్వర్గీయ శ్రీ నోరి నాగభూషణం గారు గాత్రం నేర్పేవారు. శ్రీ సోమేశ్వరరావు గారు వీణా వాయిద్యం నేర్పేవారు. అదే సమయంలో నన్ను కూడ సంగీతం, నృత్యం నేర్చుకోమని ప్రోత్సహించేది. కానీ ఆడపిల్లలతో కలసి సంగీతం, నృత్యం నేర్చుకోవలెనంటే నాకు సిగ్గు కలిగి నేర్చుకోలేక పోయాను. అవన్నీ తలచుకుంటే నాకు ఇప్పుడు చాలా బాధగా ఉంటుంది. కనీసం సంగీతం అయినా నేర్చుకు నుంటే బాగుండేదనిపిస్తుంది. నాకు తీరని కోరికలు

నా కుమారుడు చిరంజీవి అవనీంద్రుని సంగీతాభ్యాసం ద్వారానూ, నా కుమార్తె చిరంజీవి సుస్మిత నృత్యాభ్యాసం ద్వారానూ కొంతగా తీరినట్లే. అంతే గాక నా భార్య మాలతికి కూడా వీణా వాయిద్యాభ్యాసం ఉన్నది; సంగీత, సాహిత్య, లలిత కళలలో ఎంతో అభిరుచి ఉన్నది. అది నాకు ఎంతో ఆనందం కలిగిస్తుంది. చిరంజీవి అవనీంద్రునికి చిత్రకళలో కూడ మంచి కుశలత ఉన్నదని చెప్పుకోడానికి నేనెంతో గర్విస్తున్నాను.

11 / ఆగస్టు / 1997

మఱచిపోయాను, ఆ చిరుత ప్రాయంలోనే బాపట్ల వాస్తవ్యులైన స్వర్గీయ శ్రీ తూములూరి శివరామయ్య గారి చేత హిందీ భాష నేర్పించింది. మాతో బాటు తాను గూడ హిందీ పరీక్షలు వ్రాసింది. అంతే నాకు 7 నుంచి 12 సంవత్సరాల ప్రాయంలోనే సంగీత, సాహిత్య, బహు విధ భాషా జ్ఞానానికి నాంది కల్పించింది. **S.S.L.C.** వఱకూ **Special Telugu** ప్రత్యేక పాఠ్య విషయంగా నేర్చుకోవడం కూడ జరిగింది ఆమె ప్రోత్సాహం వలననే. వీటన్నిటికీ స్వర్గీయులైన మా నాన్నగారి ప్రోత్సాహం కూడా ఎంతో ఎక్కువగా ఉండేది. మఱి మా మాతామహులైన శ్రీ నాళం క్రిష్ణారావు గారు జగమెరిగిన కవి. మా పితామహులైన శ్రీ వేంకటేశ్వర్లు గారు ఆ రోజుల్లో గుంటూరు జిల్లాలో ప్రసిద్ధికెక్కిన ఒక మహాదానశీలి, వ్యక్తి. చీరాలలో వారింట్లో జరిగే శుభ క్రతువులకు మంత్రాలు చదవడానికి ఎవ్వరూ సాహసించే వారు కాదట. ఆయనకున్న మంత్ర జ్ఞానం, సంస్కృత జ్ఞానం వల్ల ఉన్న భయమే అందుకు కారణం. అదే అభిమానం, గౌరవం, శ్రద్ధ మా నాన్న గారికి కూడా ఉండేది. ఆ కారణం వలననే ఆయన అమ్మను ఎంతగానో ప్రోత్సహించే వారు. అమ్మ 1953 లో ఆంధ్ర కవయిత్రుల చరిత్ర వ్రాసి ఆంధ్ర భాషా సమితి వారి బహుమతి పొందడం ఆయన ప్రోత్సాహం వలననే. అదే ప్రోత్సాహం ఆయన మా విద్యాభ్యాసాల విషయాలలో కూడా కనపఱచేవారు.

ఇంకొక సంగతి గుర్తుకు వస్తుంది. మా మాతామహులు మనసా, వాచా, కర్మణా బ్రహ్మసమాజం పాటించే వారు. మా నాన్నగారు నిష్ఠురమైన శ్రీ వైష్ణవ సంప్రదాయంలో పుట్టి పెరిగినవారు. అయినా అమ్మ తన బాల్యావస్థలోని అభ్యాసం వలన వివాహానంతరం కూడా తెల్లవారు ఝామున ఉషోదయాత్పూర్వం (4 గంటలకు) బ్రహ్మసమాజపు కీర్తనలు పాడుకుంటుండేది. నేను ఆమె ఒడిలో పడుకుని ఆ పాటలను వినడం నాకు ఇప్పటికీ బాగా గుర్తున్నది. ః నాలోని విభవంబు నీవై, నీలోని ప్రణవమ్ము నేనై నిండి వెలిగెదమోయి ః అని ఎంతో ఆర్తితో, ఆవేదనతో, తన్మయత్వంతో ఎలుగెత్తి పాడటం నాకు నా శ్రవణాలలో గింగురుమని మ్రోగుతూ వినిపిస్తూంటుంది. ఆ పాటలు వినడానికి, కలిసి పాడటానికీ మా ఇంటి పొరుగు వారు కూడా వస్తూండేవారు.

ఇంకో సంగతి గుర్తుకువస్తున్నది. నాకు పైన అక్కయ్య ఉన్నా కూడా అమ్మ నాకు చిన్నవయస్సులో ఆడపిల్లల బట్టలువేసి, జడలు వేసి, నగలు పెట్టి ఫోటోలు తీయించుకుని ఎంతో మురిసి పోయేది. దానికి కారణం మాత్రం నాకింత వఱకూ తెలియదు. మఱి నాకన్నా ఒక సంవత్సరం పెద్దయిన అన్నయ్య ప్రతాపునకు అలాగ చేసినట్లు గుర్తు లేదు.

ఇంకొక ముఖ్య విషయం. నా పేరు రాజరాజ నరేంద్రుడు. రాజ రాజ నరేంద్ర చోళుడు రాజమహేంద్రవరం రాజధానిగా ఆంధ్ర దేశాన్ని పరిపాలిస్తున్నప్పుడు ఆయనకుండే సాహిత్యాభిమానం వలన నన్నయ మహాకవిని సంస్కృత లిఖితమైన వ్యాస మహాభారతాన్ని తెలుగు భాషలోకి అనువదించమని కోరడం జరిగింది గదా. ఆవిధమైన రాజప్రోత్సాహంతో ఆ మహాకవి భారతంలోని మొదటి 2 1/2 పర్వాలను తెలుగులోకి అనువదించి ప్రప్రథమంగా ఆంధ్ర భాషా చరిత్రలో ఒక కావ్య సృష్టికి నాంది కలిగించారు. అమ్మకు అప్పటికే తెలుగు సాహిత్యం యందున్న అభిమానంతో నాకు రాజ రాజ నరేంద్రుడనే పేరు పెట్టుకుంది. మఱి నాన్నగారికి శ్రీ వివేకానందుని మీదుండే అభిమానంతో నరేంద్ర అనే పేరుపెట్టాలనుకున్నారు. ఆ మహాకవి నన్నయ్య పేరు పెట్టితే నేను తెలుగు సాహిత్యానికి తీరని అవమానం కలుగ చేస్తానని అనుకున్నారో, లేక భయపడ్డారో తెలియదు గానీ రాజరాజ నరేంద్రుడైతే ఇద్దఱి ఉద్దేశ్యాలకు సమన్వయమౌ తుందని అలాగ పేరు పెట్టారు. ఏమో మఱి, ఇప్పటికీ శ్రీ వివేకానందుని జీవిత చరిత్ర చదువుతుంటే ఒళ్ళంతా గగుర్పాటు కలుగుతుంది.

నాకింకా బాగా గుర్తున్న ఇంకొక విషయం. అమ్మ తఱచుగా సాహిత్యోపన్యాసాల కారణంగా ఆంధ్రావనిలో తిరుగు తుండేది. ఆమె అటు ప్రయాణం కాగానే నాకు బెంగతో జ్వరం వచ్చేసేది. అమ్మని అంతగా వదలి ఉండలేక పోయే వాడిని. అందు వలన నాన్నగారు ఎన్నోమాట్లు తంతి ద్వారా అమ్మను వెంటనే తిరిగి బాపట్లకు రమ్మని కోరడం జరిగేది.
ఇంట్లో తఱచుగా సంగీత, సాహిత్య చర్చలు జరుగు తూండేవి. సుప్రసిద్ధ గాయకులూ, కవులూ అమ్మతో మాట్లాడటానికి రావడం జరుగుతుండేది. అమ్మకన్నా చిన్నవారు అక్కయ్యా అనీ, పెద్దలు చెల్లెమ్మా అనీ సంబోధించేవారు. నాన్నగారి స్నేహితులు కూడా అమ్మను చెల్లెలుగానే సంబోధించేవారు. ఆ విధంగా స్వంత మేనమామలు మాకు ఇద్దరే అయినా, మామయ్యలు చాలామంది ఉన్నారు. ఆ సంబంధం ఎంత బలీయమైనదంటే మేమింకా ఆ పెద్దలను అలాగనే పిలుస్తూంటాము. వారిలో ముఖ్యులు, మా నాన్నగారి ముఖ్య స్నేహితులు స్వర్గీయ శ్రీ పిల్లుట్ల హనుమంతరావుగారు, శ్రీ బొద్దుపల్లి పురుషోత్తంగారు, శ్రీ కాల్వ వఱదరాజులుగారు, శ్రీ స్థానం పార్ధసారధిగారు, శ్రీ నాళం రామచంద్రరావుగారలు.

1953 సంవత్సరంలో ప్రప్రథమంగా అమ్మ ఆంధ్ర కవయిత్రుల గురించి గ్రంథ రచన చేపట్టింది. అంతకు ముందుగా భారతి, మఱి ఇతర సాహిత్య పత్రికలలో వ్యాసాలు ప్రచురించడం జరుగుతూండేది. ఆంధ్ర కవయిత్రులు వ్రాస్తున్నప్పుడు మేమంతా తన వ్రాత ప్రతికి కాపీలు చేయడం జరిగింది. మేము ముగ్గురమే కాకుండా చీరాలలోని మా జ్యేష్ఠ జ్ఞాత సోదరి శ్రీమతి సుశీల మా జ్యేష్ఠ జ్ఞాత సోదరుడు శ్రీ ప్రభాకర్ కూడా చాలా సహాయం చేయడం నాకింకా బాగా గుర్తున్నది.

తరువాత ఆమె ఎన్నెన్నో రచనలు చేసింది. అప్పుడప్పుడు నా ముందు చదివి నా అభిప్రాయం కూడా అడుగుతూండేది. 1956 సంవత్సరంలో నేను ప్రథమంగా బాపట్ల వదలి రాంచీకి ఇంజనీరింగు విద్యాభ్యాసం కొఱకై ఆంధ్రావని వదలి, ముఖ్యంగా అమ్మను వదలి 1600 కి. మీ. దూరం వెళ్ళడం చాలా దుఃఖం కలిగించింది. అప్పుడు అమ్మ నాకు ఎంతో ప్రోత్సాహం కలిగించింది, ఎంతో ధైర్యం చెప్పింది. అది మొదలుగా నేను దేశ దేశాలు తిరగడం, బాపట్లకు నెలవులకు మాత్రం వెళ్ళడం జరుగుతూండేది. అలాగ వెళ్ళినప్పుడల్లా ప్రతిదినం ఏదో విషయం గురించి అంటే సాహిత్యమో, మత సంబంధమో, పురాణేతిహాసాల సంబంధంగానో చర్చలు జరుపుకోవడం ఇంకా బాగా గుర్తున్నది. ఆ విధంగానైనా అమ్మ యొక్క సాహిత్య వ్యాసంగాలతో సంబంధం కలుగుతూండేది. 1963 సంవత్సరం లో నేను కెనడాకు పి. హెచ్. డి కొఱకై రావడంతో నేను అమ్మకు చాలా దూరమై పోవడం జరిగింది. అది నాకు ఎంతో అసంతృప్తికరంగా ఉండేది.

ఆ రోజున మద్రాసులో (1963 ఆగష్టు) నేను ప్రప్రథమంగా విమానం ఎక్కే ముందుగా అమ్మ నాకు గబగబా "ఆపదా మపహర్తారం....." అనే శ్లోకం వ్రాసి, నరేంద్రా ఇది ఎప్పుడూ నీదగ్గఱుంచుకోమని ఇవ్వడం జరిగింది. అమ్మకు శ్రీరామచంద్రుడంటే ఎంతో భక్తి, ఎంతో గురి. అందు వలననే కాబోలు నేను కెనడాలో రెండు పర్యాయాలు (1964 మఱియు 1969 సం॥ లలో) తీవ్రమైన కారు ప్రమాదాలకు గురైనా కూడా ఆశ్లోకం నా జేబులో నున్న పర్సులోనే ఉన్నందు వలననే అనుకోవాలి, నాకు శ్రీరామ రక్ష అయి నాకు ప్రాణ గండం తప్పిందని అనిపిస్తుంది. ఇంతే కాదు అమ్మకు భగవద్గీతలోని భక్తి యోగం అంటే ఎనలేని గురి, అభిమానం. అందు చేతనే నాకు చిరుత ప్రాయంలోనే భక్తియోగం నేర్పించింది. నేనిప్పటికీ ప్రతి దినం ఉదయం ఒక్క పర్యాయమైనా భక్తియోగం మననం చేసుకుంటూ అమ్మను తలంచుకుంటూంటాను. 1972 లో అమ్మ భారత ప్రభుత్వం తరపున రష్యా, జర్మనీ, చెకోస్లోవేకియాలకు సాహిత్య సంఘ సభ్యురాలిగా వెళ్ళడం జరిగింది. అప్పుడు అమ్మను ఐరోపా నుంచీ కెనడాకు రమ్మని కోరాను. తాను అప్పుడు కెనడాకు వచ్చి మా ఇరువురితో 3 వారాలు గడిపింది. అప్పుడు కూడా ప్రతి దినం ఏదో ఒక విషయం పై నేను చర్చించే వాడిని. అమ్మకు సాంప్రదాయిక సాహిత్యమన్నా,

హిందూ మత పరమైన చర్చలన్నా ఎంతో ఆవేశంతో, ఉత్సాహంతో పాల్గొనేది. ఃఏ దేశమేగినా, ఎందు కాలిడినా, పొగడరా నీ తల్లి భూమి భారతినిః అనేటటువంటి ఉద్దేశ్యాన్ని అత్యంత అభిమానంతో సగర్వంగా ఎలుగెత్తి చాటించడానికి ఆమె ఎప్పుడూ ఎక్కడా వెనుకంజ వేయలేదు. శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారు ఎంతో ఆదరంతో చెల్లెమ్మా అనే సంభోధించే వారు. అలాగే మఱి స్వర్గీయులు శ్రీ బొడ్డు బాపిరాజు గారూ, శ్రీ విశ్వనాధ సత్యనారాయణ గారు కూడా సంభోధించే వారు. అక్షరాలా నిలుపరా నీ జాతి నిండు గర్వమ్ము అని అంత్యఘడియల వఱకూ కూడా ఒక తల యొగ్గని సైనికుని లాగ జాతి గర్వంతో తనకు ఆజన్మతా సంప్రదించినట్టి హిందూ మతం మీద, మన ప్రాచీన సాంస్కృతిక, సాహిత్య, సంప్రదాయల మీద చెక్కుచెదరని నమ్మకంతో, అఖండ విశ్వాసంతో అంతిమ శ్వాస వఱకూ నిలబడింది.

ఇదెందుకు వ్రాస్తున్నానంటే 1996 సెప్టెంబరు మాసంలో తన ఆరోగ్య పరిస్థితి విషమించి, ఆపరేషన్ చేయవలసి వస్తుందేమో, చేసినా బలహీనత వలన సజీవురాలిగా ఆసుపత్రి నుంచీ తిరిగి రాలేక పోవచ్చునని అక్కయ్య, అన్నయ్య, చెల్లి అత్యంత సంధిగ్ధపడుతున్న సమయంలో నేను కూడా హైదరాబాదుకు వెళ్ళడం జరిగింది. నేను వెళ్ళటానికి కూడా నా భార్య మాలతి చాలా ప్రోత్సాహం చేసింది. నేను వచ్చి తనకు ఆపరేషన్ చేయించుతాననీ, తాను సజీవిగా తన స్వగృహం (బాపట్లకు) చేరలేనేమోననే బెంగతో వెక్కి వెక్కి ఏడ్చేసింది. అట్టి పరిస్థితిలో నేనే రకమైన నిర్ణయం తీసుకోలేక పోయాను. సమయానికి మా మిత్రులొకరు శ్రీ నాగేశ్వరరావు పంతులు గారు వచ్చి అమ్మ ప్రక్కనే కూర్చుని, మృత్యుభీతి తగ్గించవలెననే యుద్దేశ్యంతో భగవద్గీత, భారత, భాగవతాలు చర్చించసాగారు. దాంతో ఆమెకు ఎక్కడలేని ఉద్రేకం వచ్చి ఉపన్యాస ధోరణిలో తాను కూడ చర్చించసాగింది. దాంతో ఆ మరణ భీతి అంతా పోయి, అవసరమైతే ఆపరేషన్ చేయించరా నరేంద్రా అని ఒప్పుకున్నది. అప్పుడు నాకు ఎక్కడలేని భీతి, నిరుత్సాహం కలిగాయి. నేనే మైనా తప్పు నిర్ణయం తీసుకుంటున్నానా అని ఎంతో భయపడ్డాను. అప్పుడు అక్కయ్య, జ్ఞాత సోదరుడు రామానందులు కలసి ఎంతో ధైర్యం చెప్పారు. ఎలాగైతేనేం ప్రపంచ విఖ్యాతి చెందిన డాక్టరు శ్రీ నాగేశ్వర రెడ్డి గారి హస్తవాసి వలన అమ్మ అప్పుడు సజీవిగా బాపట్లకు తిరిగి వెళ్ళగలిగింది. బాపట్లలోనే అంతిమ శ్వాస తీసుకోవలెనని ఆమె కోరిక, ఆశయం కూడాను. 12 సంవత్సరాల చిరుత ప్రాయంలో, 1917 లో, శ్రీ నాన్నగారితో వివాహం జరిగిన తర్వాత ఆమెకు బాపట్ల ఒక్కటే స్వస్థలం అనేటటువంటి సంప్రదాయంలో పెరిగింది, విశ్వసించింది, మనసా, వాచా ఆచరించింది కూడా. అలాగే అంతిమ శ్వాస కూడా స్వగృహంలోనే జరగడం భగవత్కృప వలననే అనుకోవాలి.

అమ్మకు అత్యంత క్లిష్ట పరిస్థితులలో దివ్య స్వప్నాలు వచ్చేవి. నాకు 12 సంవత్సరాల ప్రాయంలో (1952 లో) ఇంట్లో అందఱు పిల్లలకూ, నాన్నగారికీ, మశూచి వ్యాధి తీవ్రంగా వచ్చి ప్రాణ

సంకట పరిస్థితులేర్పడ్డాయి. అప్పుడు అమ్మ చాలా ఆర్తితో శక్తిదేవిని మనసారా ప్రార్థించింది. ఆ రాత్రి ఆమెకు స్వప్నంలో శక్తి దర్శనమై అభయం ఇచ్చింది. ఒక చిన్న బాబు మాత్రం తట్టుకోలేక పోయాడు. అప్పటికి మేము ఐదుగురం సంతానం. అలాంటి స్వప్నాలు ఆమెకు ఎన్నెన్నో వచ్చాయి. స్వర్గీయ శ్రీ బెజవాడ గోపాలరెడ్డి గారు ఉత్తర ప్రదేశ్ కు గవర్నరుగా ఉన్నప్పుడు వారి సౌజన్యంతో అమ్మ అయోధ్యకు వెళ్ళటం తటస్థించింది. అక్కడి రామాలయంలో కన్నులు మూసుకుని రామ ధ్యానం చేసుకుంటూంటే శ్రీరామచంద్రుని దర్శన భాగ్యం కలిగిందని కూడా నాకు చెప్పింది. శ్రీ గోపాలరెడ్డి గారికి అమ్మ యందుండే ఆదరం, వాత్సల్యం నేనూ అమ్మ వేరే సందర్భంలో లక్నో వెళ్ళినప్పుడు స్వయంగా చూచి ఆశ్చర్యపోయాను. వారిద్దరిదీ అన్నా చెల్లెళ్ళ అనుబంధం, పరస్పర సాంస్కృతిక, సాహిత్యకోపాసన పర సంబంధం. అమ్మకు దేశాధ్యక్షులుగా నున్నటువంటి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు గారు ఇంటర్వ్యు ఇచ్చినప్పుడు, తాను సంస్కృతంలో వ్రాసిన శ్రీ కన్యకమ్మ నివాళి చదువుతూంటే కన్నులు మూసుకుని దివ్యానుభూతిని పొందారట. అంతటి మహా పండితుల ఆదరం, మన్నన సామాన్యులకు లభించగలవా, మఱి. ఆమె వ్రాసిన రచనలలాంటివి, భాష అలాంటిది. శుద్ధ గ్రాంధికంలో తప్ప మరేమీ వ్రాసేది కాదు. అందువలన సామాన్య జనాదఱణ లభించి యుండక పోవచ్చును గానీ, తెలుగు సాహితీ చరిత్రలో ఒక గౌరవం, సంప్రదాయం, శైలి, ఒక వినూతన రచనాలంకారం తీసుకు వచ్చింది. అది అంతా ఆమెకున్న స్వదేశ, స్వభాషాభిమానాలే కారణం. సంస్కృతంలో వ్రాసింది, తెలుగులో వ్రాసింది. ఆమె రచనల్లో కొన్ని నేను చదివి ఆనందించినవి ఇక్కడ ఉదాహరిస్తాను.

ఃమన సాహితి, మధుభారతి, రసవాహిని, భువమోహిని, జనరంజని, శివరంజని, అఘభంజని, జ్ఞానాంజని, మన సాహితి, మధుభారతి, రసవాహిని, భువమోహినిః. చూడండి ఆ భావ సౌందర్యం, ఆ పద చాతుర్యం, ప్రతి పదంలో ప్రతి వాక్యంలో మాతృదేశాభిమానం, తన రక్తంలో గడ్డ కట్టుకుని జీర్ణించిన మాతృదేశ గౌరవం ఎంత గాఢంగా, ఎంత దృఢంగా వెలిబుచ్చుకుందో మఱి. ఇలాగే మఱింకొకటి: మన సంస్కృతి, ఘన సత్కృతి, పుణ్యకృతి, భువన సుకృతి, మన సంస్కృతి, ఘన సంస్కృతిః. ః రుద్రమాంబ భద్ర ముద్ర, కన్యకమ్మ త్యాగ గరిమ, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ కనుదోయి నిండి పొరలి పొరలి ప్రవహించిన కరుణరసము, ఒక్కటొక్కటి అననేల, ఎన్నెన్నో, ఇంకెన్నోః. అలాంటి మచ్చుకలు ఎన్నెన్నో, ఇంకెన్నో. తన రచనలన్ని తలమానికాలే. కాని అన్నింట్లోకీ నాకిష్ట మయినది మా తెలుగు మాంచాలలోని మాంచాల వర్ణన. ఃనిగనిగని మెఱయుచు, సొగసులను గుఱియుచు, చీకట్ల చీకొట్టు చెలుద సిగ ఒకయెత్తు. అలివేణి సిగపైన నిలుచుటే పెన్నిధిగా -- అరవిరిసి నగు మొగలి సిగపూవు పైయెత్తుః. ఃజగతి గల అందాలు నగుమోముపై నిలవ --- విశదమై వెలిసేటి చిరుదైన ఆ వెలది వెన్నెదురె ఒక యెత్తుః. ఃకాము బాణములైన నళినాక్షి విస్ఫార నయ

నమ్మ లోకయెత్తుః. ఃబంగారు వంకె యన పొంకముగ పొందారు ఆ పొలతి నాసికయె ఒక యెత్తుః. ఃతరుణి నాసిక పైని అక్కజపు వజ్రంపు ముక్కరయు పైయెత్తుః. ఃహితము నుపదేశించు మితభాషి, శుకవాణి, మురుపు హరువులు గులుకు పలుకులును పైయెత్తుః. ఇలాగే రమ్యమైన శైలితో, భావోద్వేగంతో ఒక మహా కావ్య పఠనా జనిత రసానందాంబుధిలో మునకలు వేయించి మేను గగుర్పాటులు కలిగించే ఉదాహరణలు ఎన్నెన్నో. నేను కావ్య పఠనం ఏమీ చేయలేదు గానీ చిన్నప్పుడు చదువుకొన్న కొన్ని పద్యాలు లీలగా గుర్తున్నాయి. మను చరిత్ర లోని ఃఅట జని కాంచె భూమిసురు డంబరచుంబి శిరస్సరజ్ఝురీ ముహుర్ ముహుర్లుటదభంగ...... ః పద్యం చదువుతుంటే ఏ లాంటి రసానుభూతి కలుగుతుందో అమ్మ వ్రాసిన మాంచాల వర్ణన అలాగే ఉంటుందనిపిస్తుంది. అల్లసాని పెద్దనలాంటి మహా కవి కావ్యం వ్రాయమని శ్రీ కృష్ణ దేవరాయలు కోరితే, ఃనిరుపహతి స్థలంబు, రమణీ ప్రియ దూతిక తెచ్చి ఇచ్చెడు కప్పుర విడెము, ఊయల మంచము ----ః అంటూ ఎన్నెన్నో కోరికలూ ఆకాంక్షలూ పెట్టాడు. మఱి అమ్మకు అలాంటివన్నీ ఎలాగ సమకూరగలవు. మమ్మల్ని పెంచుకుంటూ, నాన్నగారికి సేవలు చేస్తూ, దేశదేశాలు తిరిగి సాహిత్య, ధార్మికోపన్యాసాలిస్తూ ఊపిరి తిరగని పరిస్థితులలో కూడా ఇలాంటి మహా రచనలు చేయ గలిగిందంటే అది దైవ సంకల్పం అనాలో, పూర్వ జన్మ సుకృతం అనాలో, తన తల్లి తండ్రుల ద్వారా అందిన ఆజన్మ సంపర్క సంస్కారణ యనాలో, స్వయం ప్రోషిత దీక్ష, శ్రద్ధ, తెలుగు భాష యందు తనకున్న మహత్ గౌరవం అనాలో నాకు తోచడం లేదు. ఈ రోజుల్లో ఈ లాంటి కవులు చాలా అరుదు. భాషాభిమానం అసలే లేదు. చౌకబారు రచనలూ, సాహిత్యంలో ఉండే మోజు సంప్రదాయ రచనల్లో లేదు జనానికి. అయినా ఆమె తన స్థాయితో రాజీ పడలేదు. ఒకటే ధ్యేయం, ఒకటే శైలి. భాష సజీవంగా ఉండాలి. భాష సజీవం కాకపోతే జాతే నష్టమైపోతుందని ఆమెకు తీవ్రమైన ఆవేదనగా ఉండేది. నాకు భగవద్గీత లోని ఒక శ్లోకం గుర్తుకు వస్తున్నది.

మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।
యతతామది సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్వతః ॥

అలాగే దేశంలో ఎందరెందరో కవనం చేస్తారు, రచనలు చేస్తారు. కానీ వెయ్యి మంది కాదు, లక్ష మందిలో ఏ ఒక్కరికో గానీ ఆ దివ్య రచనా శక్తి గలుగదు. అదే అలాంటి వ్యక్తులకు పరమావధి, పరమధ్యేయం, ఆజన్మాంత లక్ష్యం కూడానూ. ఆమె అలాగే జీవించింది చివఱి వఱకూ కూడానూ. అమ్మకు చాలా ఇష్టమైన ఈశోపనిషత్తు లోని ప్రధమ శ్లోకంతో ఈ వ్యాసం ఇంక ముగిస్తాను.

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముచ్యతే ।
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవాశిష్యతే ॥

ఆమె జీవితం ఇలాగే చివరకు ఆ పూర్ణంతో ఏకమై పోయింది. అదే నాకు సంతృప్తి, అదే నాకు శోక విమోచని.

శైశవావస్థలో కలిగిన మాతృ స్థన్య పిబనానంద జనిత సాంస్కృతిక, సంస్కార, రసానుభూతి యనుకుంటూ అస్త వ్యస్తంగా ఏదో ఏదో వ్రాసేశాను. ఇందులో, నాకున్న పాండిత్య ప్రకర్ష అసలు కానే కాదు. ఆమె ప్రోత్సాహంతో చిన్నప్పుడు నేర్చుకున్న భాషాభిమానం, మాతృదేశ గౌరవం, మాతా పితరుల యందుండే గౌరవంతోనే ఈ మాత్రమైనా తెలుగులో వ్రాయ గలిగాను.

వాగర్థా వివ సంపృక్తౌ వాగర్థః ప్రతిపత్తయే। జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ॥

ఓం శాంతిః, శాంతిశ్శాంతిః